# వ్యాస కౌముది



## సాహిత్య నమూనాలు

వెల్చేరు చంద్రశేఖర్

### ముచ్చటగా ముగ్గురు

నాకున్న కొద్ది మంది స్నేహితులతో విశాఖ రచయితల సంఘం సమావేశాలకు వెళ్లే వాడిని. దాన్నుండి విడి విశాఖ సాహితి మొదలుపెట్టారు 1971 లో. ఆ సందర్భంలో పరిచయమయిన రచయిత నవులూరి వెంకటేశ్వరరావు గారు నన్ను ఒక కథరాయమంటే రాసేశాను మొదటిసారిగా. ఆ కథను ఆయన దిద్దారు. విశాఖ సాహితి 'తోరణం' అన్న కథా సంకలనంలో వేసుకున్నా, నా లోపం నాకు తెలిసి, 1985 వరకు రచనను తిరిగి ముట్టుకోలేదు.

అదే సమయ, సందర్భాలలో నాకు పరిచయమైన మరో వ్యక్తి జేష్ఠ [ఇవటూరి చిన్న వెంకట బసవరాజు] అద్భుతమైన తాత్త్వికుడు. జ్యేష్ఠ గారు ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో అధ్యాపకుడిగా పనిచేసేవారు., నా ఆలోచనా పద్దతి నిర్మాణానికి సహకరించిన తాత్త్విక బంధువు, స్నేహితుడు. ఆయన వలన పాశ్చాత్య సాహిత్య0; కాము, సాత్రే, ఫ్రాయిడ్ రచనలు; మన షడ్ దర్శనాలు; జాతీయ అంతర్జాతీయ రాజకీయ దృక్పధాలు; ఆ [ఓహ్ ఆదో] ప్రవాహం నుంచీ పుడిసెడు తీసుకుని తాగగలిగాను. ఆ అనుభవం వర్ణనాతీతం.

మూడో వ్యక్తి, కొవ్వలి జగన్నాథరావు గొప్ప స్నేహితుడు. విశ్వనాధ, గోపీచంద్, బుచ్చిబాబు, పుజో, ఇర్వింగ్ వెలస్, పెర్ల్ s .బక్ వగైరాల రచనల రుచులను ఆస్వాదించే అలవాటు చేశాడు. వాడితో అర్ధరాత్రి వరకు మెయిన్ రోడ్డులోని హిందూ రీడింగ్ రూమ్ ఎదురుగా ఉండే గుప్తబ్రదర్స్ పుస్తకాలకొట్టు అరుగు మీద కూర్చుని చేసిన వాదోపవాదాలు మరువామ్ మరువాం!

# అవలోకనం [రెండు]

కొందరు రచయితల వ్యక్తీకరణ పరిశీలిస్తే వాళ్ళ మధ్య కొన్ని విచిత్రమైన సమానాంతర సంబంధాలు, పోలికలు, విరుద్ధమైన భావజాలాలు కనిపిస్తాయి.

విదేశీ విలువల కొలమానికతో ఏర్పరచుకున్న భావజాలాలు ప్రజలమీద భయంకరంగా రుద్దుతూ అవి తప్ప ఇంక ఈ ప్రజలకి దిక్కు లేదు అనే ధోరణి సరైనదేనా? అందులో ఆ సాహితీవేత్తల నమ్మకంలో, నడవడిలో నిజాయితీ పాలెంత?

సాహిత్యం జీవిత సంఘటనల, విలువల, విశ్వాసాల, సంస్కృతుల కలనేత. జీవించడానికి విచికిత్స కన్నా విశ్వాసం ఎక్కువ అవసరం. అది ఈ దేశ సాంస్కృతిక జీవితంలో అంతర్భాగం గా ఉంటుంది. తార్కిక ఆదర్శం మనిషి మనోవీధిలో ఉన్నంత వరకూ దానితో పేచీ లేదు. జీవితంలో తర్కానికి అందనివి, అనుభవంలోకి వచ్చేవి చాలా అంశాలు వుంటాయి. తర్కానికి అందని వాటి గురించి చెప్పడానికి కొందరిలోనన్నా జంకుంటుంది. వొక గొప్ప వామపక్ష, హేతువాద భావాలు కల తెలుగు రచయిత ఒకసారి జ్యోతిష్యం మీద విశ్వాసం వెలిబుచ్చారు, నా ముందు మూడు సార్లు బల్లగుద్ది “నిజం నిజం నిజం” అంటూ! బహిరంగంగా ఆ విశ్వాసాన్ని వ్యక్తం చెయ్యడానికి అది అతని ప్రకటిత ఆదర్శంతో ఢీకొంటుంది. విశ్వాసానికి మొదటి పీట వేసి ఆదర్శానికి రెండో పీట వేయడానికి లేక అంతకాలం పట్టుకుని వేళ్ళాడిన ఆదర్శానికి తిలోదకాలివ్వడానికి ధైర్యం కావాలి; ఇది అందరికీ ఉండదు. అందరూ విశ్వనాథలా ధైర్యవంతులు కాదు; ఆయనలా ఇలా అనలేరు:

ఓ చిన్నమాట
లేతబుర్రలు కొక్కిరిస్తే
ఆకతాయి తో యేమిగానీ
తాతతాతలనాటి కథలు
త్రవ్వి పోస్తానోయ్

ఆ ముక్తాయింపులో సంప్రదాయ జీవన సిద్ధాంత ఔన్నత్యాన్ని మళ్ళీ నెలకొల్పాలి అనే తపన, సమాజానికి సహజ శక్తిని ఇచ్చే అంతరించిపోతున్న సాంఘిక పాత నియమాలు పునరుద్ధరింపబడాలి అన్న కోరిక కనిపిస్థాయి. సమాజానికి సహజ శక్తిని కలిగించేది సంఘనియమాలు, అవసరమైతే దౌర్జన్యాన్ని ప్రయోగించగల శాసనాలు అమలుచేయాలి అన్న కొడవటిగంటి కుటుంబరావు అభిప్రాయం ఈ సందర్భంలోనూ ఉటంకించవచ్చు.

ఈ సనాతన సంఘ నియమాలు, శాసనాలు ఎవరివి? మనవే, ఒకనాటివే కదా! కాలానుక్రమణంగా పరిణామము చెందినవె, ఎంతో కొంత మేరకు! బైట, అస్పృశ్యంగా ఉంటూవచ్చి ఒక శుభమూహూర్తాన్నో, అశుభముహుర్తాన్నో మన నెత్తిన మన అనుమతిలేకుండా రుద్దబడినవి కాదు గదా!( బాహ్య రాజకీయ కారణాలు పరిగణించలేదు ఇవి మనం చేసుకున్న లేదా సర్దుకుపోయిన తత్వంగా తీసుకున్నాము)

"అంతర్ జాతీయ సంస్కృతిని మెచ్చేవాడికి జాతీయతత్వం రుచించకపోవచ్చు. దేశభక్తి నుండి జనించే జాతీయ సంస్కృతే నిలబడే సంస్కృతి! అల్లాంటి అనేక జాతీయ సంస్కృతుల్ని కలిపి వొక వుమ్మడి సంస్కృతిని నెలకొల్పడం అసాధ్యం. వొకవేళ ఏర్పరచినా నిష్ప్రయోజనం."

అది టీ. ఎస్. ఎలియెట్ భావజాలం ఆయన మాటల్లో. విశ్వనాధ భావజాలమూ అదే. విశ్వనాధ ఎలలియెట్ కు చెప్పి అనిపించిన మాటలు కావవి. కాషాయ భావజాలం అని కొట్టిపారేద్దామా?

మహాకవి శ్రీశ్రీ

"మాకు గోడలు లేవు

గోడల్ని పడగొట్టడం మా పని "

అన్నారు. ఎలియట్ [విశ్వనాధ], శ్రీశ్రీ లలో ఎవరి అభిప్రాయాలు వాస్తవికతకు దగ్గిరలో, తార్కికంగా ఉన్నాయో వేరే చెప్పక్కరలేదు. పై ఇద్దరిలో ఎవరు సత్యానికి దగ్గరగా వున్నారు? ఎవరి గోడలు ఎవరం పగల గొట్టగలం – మనవి మాత్రమే పగల గొట్టగలం. పోనీ ఇతరులవైనా పగలగొట్టడంలో మనం కృతకృత్యులయామా? లేదేమో.!

"మనం ఏ భావాల ప్రభావంలో ప్రవర్తిస్తున్నామో తెలియకుండా నడుచుకోడం తప్పయితే, ఏ భావాలను ప్రచారం చేస్తున్నామో ఆలోచించకుండా రచనలు చెయ్యడం పది రెట్లు తప్పు," అన్నారు బాలగోపాల్. పదిరెట్ల తప్పు చేసాము! అందరూ సమానం అనడంవేరు, అందరికి సమానావకాశాల కల్పన అనడం వేరు.

తిండి ఆకలి తీరుస్తుంది కానీ అది కేవలం బీదవాడి ఆకలి తీర్చడానికి కాదు ఉపయోగపడేది. పేదల తరఫున వకాల్తా పుచ్చుకునేవాడి రాజకీయ ఆకలి తీరాలి ముందు. ఇందులో వున్న తత్వానికి ఆకర్షణీయమైన నిజం, రూపును తేవాలి హేతువాదం అనే మంత్రదండం ద్వారా. హేతువాదానికి అనేక నాలుకలుంటాయి.

పెట్టుబడీదారీ వ్యవస్థ ఎలాగైతే అందరు సమానులుకారని అందరికీ పని ఇవ్వలేదో అలాగే కమ్యూనిస్టు వ్యవస్థ అందరికి సమాజ మార్పుకు అవసరమైన ఆలోచనా స్వేచ్ఛ, మేధోమథన శక్తి కూడా కల్పించలేదు. ఉదాహరణ: సోల్జెనిత్సిన్ తన కమ్యూనిస్టు దేశంలో ఎదుర్కొన్న ప్రతికూలత; స్టాలిన్ నియంతృత్వ ధోరణి మరియు హింసాత్మక వైఖరి; టియానాన్మెన్ స్క్వేర్ అణచివేత.

జ్యేష్ఠ [కౌటిల్య] అభిప్రాయం ప్రకారం: "విప్లవాలు ఉన్న వ్యవస్థకు పెద్దఎత్తున జరిగే మరమ్మత్తులు, ప్రతిసృష్టి. దేశాల మధ్య బాహ్యంగా కనిపిస్తున్న సమస్యలకి పోలికలు వుండవచ్చు, తీవ్రపరిస్థితులలో అవి బైటపడావచ్చు. మేజర్ రిపేరు ఒక్కొక సమాజానికి ఒక్కొకటి అవసరమవుతుంది. మెకానిక్ ఒక్కడే అయినా బెంజికారుకి తగ్గ రిపేరు బెంజికారుకి, మారుతికారుకి కావలిసిన రిపేరు మారుతి కారుకి చెయ్యలే తప్ప, "గర్జించు రష్యా" లేక "భక్షించు చైనా.." అనే నినాదపూరిత కవితోద్రేకం వినోదానికి, ఉద్రేకానికి ఉపయోగ పడవచ్చునేమోగాని తగిన మరమ్మత్తుకు తోడ్పడదు. దేనికి ఏ మరమ్మత్తు అవసరము, ఏ సాంకేతికనిపుణుడు దాన్ని చెయ్యగలడు అన్నవిషయాలను కనిపెట్టడానికి సత్తాకావాలి. పిడుక్కీ బియ్యానికి ఒకటే మంత్రం పనిచేయదు అని ఒప్పుకోడానికి మేధోపరమైన నిజాయితీ ఉండాలి. "

ప్రతి విరుద్ధ భావాల్ని లేక ద్వంద్వాలను వ్యతిరేక ధోరణితో చూడడం మంచిదికాదు. ద్వందాలు గతితార్కికానికి రెండు కాళ్ళు, రెండు కళ్ళు. ప్రతివిషయం, ప్రతివస్తువు, ప్రతిసంఘటనలో రెండు విరుద్ధ విషయాలుంటాయి ప్రకృతిలోలాగే., మార్పుకు రెండూ అవసరమే. మంచి మాత్రమే ఉండదు; చెడు మాత్రమే ఉండదు. అలాగే ఉత్తరధృవం మాత్రమే లేక దక్షిణ ధృవం మాత్రమే ఉండదు. భూస్వామి ఉంటే పాలేరు వుండాలి; పాలేరు ఉండాలంటే భూస్వామి ఉండి తీరాలి. పెట్టుబడిదారులు, కార్మికులు ఒకరిమీద ఒకరు ఆధారపడి ఉన్నారు. వాళ్ళు ఒకరితో ఒకరు పోరాడవలసిన శత్రుసేనలు కారు.

ఈ వైరుధ్యాలు సమాజ అస్తిత్వానికి, దాని నడకకు అవసరం. సృష్టి, స్దితిలయలు ఆ విధంగానే జరుగుతున్నాయి. సూర్యుని చుట్టూగ్రహాలు తిరుగుతున్నాయి. ఆకర్షణ, వికర్షణ రెండు సమానంగా వుండబట్టే ఇది జరుగుతుంది. ఏది ఎక్కువున్నా అస్దిరత ఏర్పడుతుంది. కొత్త అద్భుతం జరిగి ఉన్నవాటిని ప్రభావితం చేస్తే, స్థితి పోయి లయకు దారితీస్తుంది. మరో విషయం: ద్వందంలో వైరుధ్యం వొక్కటే వుండదు, సామరస్యం కుడా వుంటుంది. దాన్ని కనిపెట్టటం చాలా ముఖ్యం. ఉదా: భార్య, భర్త వీళ్ళిద్దరూ మౌలికంగా ఆడ-మగా అన్న భిన్నత్వం వుంటుంది; ఉండేది శత్రుత్వం కాదు; అహంభావం వలననో మరో కారణం వలననో దాన్ని కొనుక్కుంటే తప్ప. "వీరి మధ్య వైరుధ్యం ఎలా వుందో, సామరస్యం అలాగే వుంటుంది," అని జ్యేష్ఠ అనేవారు. ఆదాయం-వ్యయం, మరొక ద్వంద్వము.

ప్రజలు–ప్రభుత్వం అనే ద్వంద్వములో సామరస్యం లేకపోతె శత్రుదేశం వల్ల అపకారం జరగవచ్చు. ప్రజల సమస్య మనదేశం-శత్రుదేశం సమస్య అయిపోతుంది. "ప్రజలు–ప్రభుత్వం" మధ్య విరోధం (వైరుధ్యం) అప్రధానమై పోతుంది.

వివేకానికి పరాకాష్ట వైరుధ్యాలలో ప్రధానమైనదేదో గుర్తించి, పరిష్కారాన్ని అనుకూలంగా మార్చుకోడం. ఇంతగా ఆలోచించే శక్తి చీటికీ మాటికీ పిడికిళ్లు బిగించే ఆవేశపరులకి ఉండదు. ఆవేశం కొన్ని వేళల అవసరమైనదే; లేకపోతె కళ రాణించదు!

ఒకరకం ఆవేశం శ్రీశ్రీ షష్టి పూర్తినాడు బయటకొచ్చింది. ఎలా అంటే....

అభ్యుదయం నుండి విప్లవ ఆదర్శం లోకి జరిగిన మార్పులు. ఆ ప్రక్రియ తెలుగుసాహిత్యాన్ని విపరీతంగా ప్రభావితం చేసింది. "యెర్ర గోచీ" వాళ్ళే రచయితలన్న భావనను కలిగించారు; అలా శాసించారు కూడా. "యెర్ర గోచి" అన్న పదజాలం పురాణం సీతది.

ఈ యెర్ర ఆదర్శం కొన్నాళ్ళు నడిచింది. అమ్మకాలకు [circulation] అడ్డురావడం వలన పత్రికల వాళ్లకి నచ్చలేదు. ఎర్రగోచి కన్నా గోచిలో వున్నది వస్తువైతే పత్రికలూ అమ్ముడు పోతాయని శృంగార కథలు మొదలు పెట్టారు; అవి ఊపందు కున్నాయి. దానికి తోడు కాష్మోరా మార్కు జడుపు "సాహిత్యం" రాజ్యం చేసింది; కొందరికి కాసుల వర్షం కురిపించింది.

ఆ తర్వాత గోడలు లేచాయి –మైనారిటి సాహిత్యం, స్త్రీ వాద సాహిత్యం, దళిత సాహిత్యం, అస్తిత్వ సాహిత్యం, ప్రాంతీయవాదం, వగైరా.

సోమరులను, ఎముకలు కుళ్ళి, వయస్సు మళ్లిన వాళ్ళను వెనక్కి వదిలేసి విప్లవరచయితలు వర్క్ షాప్ పెట్టి నమూనాలు సృస్టించారు ఇంక ప్రపంచంలో ఇతర నమూనాలకి చోటే లేదు, అనుకున్నారు వాళ్ళు.

ఆదర్శం నేల విడిచి సాముచేసే స్థాయికి "ఎదుగుతుంది" యదార్ధ జీవితాన్ని క్రింద వదిలేసి. కానీ నేల మీదికి ఏదో ఒకనాడు రాక తప్పదు.

అరువు తెచ్చుకొన్న సిద్ధాంతాలని రంగరించి సాహితీ సృష్టిచేసి అసహనానికి గురయేకన్నా మనకున్నదానిని ముందు తెలుసుకునే ప్రయత్నం చేయాలి. ఈ జాతికి ఈ దేశానికి వొక జీవనవిధానం, వొక తాత్వికత వున్నాయి. ఎప్పుడూ వాటిమీద దాడి జరుగుతూ వుంది. ఆ దాడి జీవనవిధానంలో ఇమిడి వున్న నాజూకు లక్షణాలమీద జరుగుతుంది. హిందూమతం మార్చాలంటే దానితో ముడిపడివున్న ఆర్ధిక పరిస్ధితి, సాంఘిక, సామాజిక నిబద్ధత, అందులోని సాంప్రదాయక కాఠిన్యత, మొండితనం కూడా మార్పు చెందాలి. ఆ గొలుసును బలమైన తర్కంతో మార్చవచ్చు, అది బెంగాలీ సాహిత్యంలో జరిగింది కూడా.

ప్రజలకి సమస్యలు, కష్టాలు, దుఃఖం ఉన్నాయి; అవి జీవితంలో నైరాశ్యాన్ని నిస్పృహని కలుగచేస్తాయి. కానీ వాటినేపట్టుకు వేళ్ళాడి వాటికి నచ్చిన కారణాలు వెతికి నచ్చిన రాజకీయపు రంగు పులిమి ప్రచారం చేయడం జరుగుతోంది. మిగతా స్పందనలు, అవగాహనలు, సామ్రాజ్యవాద భావజాలమ్ క్రింద జమ అవుతున్నాయి.

కళాత్మకత, మానవత్వం, సార్వజనీనత, అన్న గుణాలని గణించకుండా పక్కనపెట్టి, సిద్ధాంతాల ప్రలోభంలో పడి ఎన్నో గొప్ప వ్యంగ్య కథలలో, కథకులలో (గురజాడ, చలం, రావిశాస్త్రి, కారా, మొదలుగా) తమకిష్టమైన రంగును చూసుకోవడం శోచనీయం.

అన్ని బిడియాలను ఛేదించి చాలామంది రచనలు చేసేరు. సంస్కృతిని జీవనవిధానాన్ని బిడియంగా, బిడియాలు అభివృద్ధి నిరోధకాలుగా ప్రచారం చేసిన అభ్యుదయ వాదులున్నారు. సోషలిజం, కమ్యూనిజం, మార్క్సిజం – పేరేదైతేనేమి – ఓ భక్తి ఉద్యమంలాగ సాగి చాలామందిని అంధకారంలోకి నెట్టేసింది; వాళ్ళు దాన్నే వెలుగుగా నమ్మారు. ఎటునుండి వస్తున్నామో తెలియాలి; ఎటు పోతున్నామో తెలియాలి.

మరోలా చెప్పాలంటే నిర్దిష్టమైన భవిష్యత్తుగురించీ కృషి చేసేవారికి గతం గురించి తెలియాలి. హిందూ మతంలోని కుటుంబవ్యవస్థ, ఆలోచన, నియమనిబంధనలు తొలిగించడం అంత తేలికకాదు. ఎన్నో పరిణామాల అనంతరం కుటుంబవ్యవస్థ ఏర్పడింది; నియంత్రించబడింది. ఈ నియంత్రణ వెనుక మత భావ పరిణామము, ప్రకృత్యుపాసన, ధర్మతత్పరుడైన దైవము, పరిపూర్ణతకు మరో పేరైన పరబ్రహ్మము ఉన్నాయి. ఈ స్థితిగతులు తార్కికమైనవి. ఆ వ్యవస్థను తెలుసుకోవాటానికి అవసరమైన స్వేచ్ఛ, మానసిక వికాశము ఆ నాటి తాత్వికులకుండేవి. వాళ్ళేయోగులేమో, రుషులేమో. భారత దేశంలో లోతైన మేధోమథనానికి వాళ్ళే పునాది.

ఆ వాస్తవాలను పక్కకు తోసి అరువు తెచ్చుకొన్న (ఎంగిలి) సిద్ధాంతాలని రంగరించి సాహితీ సృష్టి చేసి, ఇదే సాహిత్యం అని ఇంతకంటే ఇంక దారిలేదు, ఈ దారిలోకి రానివాళ్ళ సాహిత్యం వృథా అనే పూనకం లోకి వెళ్ళారు. ఈ అసహనానికి గురయేకన్నా, ఈ జాతికి ఈ దేశానికి గల తాత్వికత, గతం, విశ్వాసాలపై ఆధారపడటం క్షేమదాయకం అన్న విషయాన్ని కావాలని విస్మరించారు. విస్మరించి వదిలేసినా ఫరవాలేదు; వాటి మీద దాడికి పాల్పడుతున్నారు, ముఖ్యంగా నాజూకు అంశాలు లక్ష్యంగా. "హిందూమతం"తో దేశ ఆర్థిక పరిస్థితి. సాంఘిక, సామాజిక నిబద్ధత, అందులో సాంప్రదాయక కాఠిన్యత, మొండితనం ముడిపడివున్నాయి. అవి తేలికగా ప్రతికూల తర్కానికి దొరుకుతాయి. పైన చెప్పినట్టు!

నా కనిపిస్తుంది. కళాకారులు అబద్ధం చెప్పరు, నిజం కూడా చెప్పరు; వాళ్లకు నచ్చింది చెబుతారు. దానికి తోడు కళాత్మక విలువల గురించీ పట్టించుకోడం మానేశారు. పైన చెప్పినట్టు చివరకు పాఠకులు, పత్రికల వాళ్ళు విసుగొచ్చి ఆవలించడం మొదలుపెట్టి వేరే మార్గాలను ఎన్నుకున్నారు. శృంగార కథలు, జడుపు కథలు, అభూతకల్పనలు ఎంచుకున్నారు. ఆ తర్వాత దళిత సాహిత్యం, స్త్రీ సాహిత్యం, మైనారిటీ సాహిత్యం పుట్టి ఇప్పటి వరకూ ఉన్నదంతా బ్రాహ్మణ సాహిత్యం కింద తేల్చేసారు.

చలం చెప్పినట్టు కమ్యూనిజం కూడా ప్రజాభౌతిక అవసరాలను పాతబూజుల నమూనాలు వొదిలించుకు చూడమంటుంది. కమ్యూనిజం లోని పెద్ద బలహీనత సైద్ధాంతికమైనదే. యెర్ర కన్ను వాళ్ళ వృత్తాన్నీ దాటి చూడలేదు. దాని మీది నమ్మకం ఒక మూఢనమ్మకంగా మారిపోయింది. ఆ నమ్మకం తర్కంతోనూ సత్యనిరూపణతోనూ సడలిపోదు –

అదేవాళ్ళ బలం. వొక రచయతన్నట్టు వాళ్ళది భ్రష్టయోగిత్వం. ప్రస్తుతం మనం చూస్తున్న అసహన ఉద్యమం వారిదే. సంపూర్ణాహారం కాలేకపోయింది (జ్యేష్ట)

అభ్యదయ కవి ఆరుద్ర విప్లవకవిత్వం మీద చురకలు వేశారు:

వీళ్లందరి మీద కూనలమ్మ రూపంలో

పొరుగు దేశము లిచ్చు
పుల్ల ఇజములు మెచ్చు
మూర్ఖమెప్పుడు చచ్చు

సగము కమ్యూనిస్టు
సగము కేపిటలిస్టు
ఎందుకొచ్చిన రొష్టు ...
ఆయనొక్కడేనా ...
నేను ఒక మూర్ఖుడనే
ఇ నా కన్నా మూర్ఖులు లాగుపడుతూంటే
ఆనంద పరవశ్యము
చే నవ్వక తప్పలేదు సిరిసిరి మువ్వా ..
నిన్నటి కమ్యూనిష్టులు
నేటి మర్యాదస్తులు
ఉదారవాదులు సంపన్నగృహస్తులు
వ్యాపారైక దృష్టులు
తపోభ్రష్టులు..

..,రాసింది ఎవరనేది వదిలిపెట్టి ఏం చెప్పాడు అనుకుంటే., అలాంటి వొక కొలత బద్ద. కొంతమంది కుర్రవాళ్లు? దాసులు, అంటూ కవిత. ఈ కొలత నిజంగా అలజడి లేపింది. ఇది నిజంగా దాస్యమా? అని వెదుకులాట మొదలు పెడితే సరైన అవగాహన, (దర్పణపు లేదా కుడి యెడమైన అవగాహన కాదు) జీవితానుభవం ( జ్ఞాన సంబంధమైనది కాదు.) ప్రేరణాత్మకమౌతాయి. ఈ కొలమానినులు భయం కలిగిస్తాయి.

తత్వశాస్త్రం అధ్యయనం చేసినాచెయ్యకపోయినా మనుషులందరికీ వొక తాత్విక చింతనా దృక్పథం, వుంటుంది, లేదా జీవితానుభవంతో యేర్పడుతుంది. అది స్వయంప్రకాశమై స్వీయ ఆలోచన పరిణితితో ముడిపడి వుండాలి. పైన చెప్పినట్టు దర్పణంలో ప్రతిబింబం కాకూడదు. దర్పణంలో ప్రతిబింబం యెదగదు. ఇరుగట్ల మధ్యా వొదిగి ప్రవహించే కొలోనియల్ ప్రతిబింబాల్ని మనం చూస్తున్నాం. వీటికి అంతర్గత చైతన్య స్పృహ వుండదు. రచయితగా బహిర్ చైతన్యం కన్నా ఆంతరంగిక వికాశానికే ప్రాధాన్యత నిచ్చి, సాంఘిక చైతన్యం ఆశతో ముందుకు వెళ్ళిన సాహితీ కారులు వో మూల ఇప్పటికీ మూలుగుతున్నారు.

సమాజంలో వున్న చింతనా పరమైన పూర్వాపరాలు చెప్పగలడం కళ. దాన్ని తన ప్రభావిత చింతనతో చైతన్యవంతం చెయ్యాలనుకోడం అవివేకం! చాలామంది అది వొప్పుకోడం లేదు. అలాకాక జీవిత తత్వాన్ని కళాత్మకంగా (ఇక్కడ రచనలు) అన్వేషించడమే లక్ష్యం చేసుకుంటే?

ఈ దేశపు నదులలో, పక్షులలో, మనుష్యులలో, వారి జీవితానుభూతిలో, జీవన సరళిలో, అంతర్లీనమైన సంస్కారం ఒక మతంగా రూపాంతరం చెందడంవల్ల, ఏర్పడిన జాతిని కాదని కొత్తగా మేము ఏదో సృష్టిద్దామంటే అది కృత్రిమంగా ఉంటుంది.

వూహకీ స్పురణకి వ్యత్యాసముంది. ఊహ బాహ్య ప్రపంచపు జ్ఞానమ్,(ప్రతిబింబం) స్పురణ అంతరంగపు అల. అంతరంగంలో మట్టి వాసనలు విరుస్తాయి వాసనలు నాగరికతా నైతికతలే, అవి కొలోనియల్ వైట్మాన్ బర్డేన్ లో, రెడ్మాన్ బాధ్యతలో కావు, కాకూడదు. వొక మనిషి చర్మం మరోమనిషికి తొడగడం కుదరదు ... అందుకే ఎవరో నువ్వు కొందర్ని అర్ధం చేసుకోవాలి అంటే కమ్యూనిస్టువి కాకతప్పదు అంటూ లిమిటేషన్ పెట్టారు. కానీ ఎవరూ నువ్వు మనిషివైతేనే నీకు ప్రపంచం అర్ధం అవుతుంది అని చెప్పరు.

అయితే ఈ మోడల్స్ (models) ఇప్పటి నిజాలని చర్చించాలి. వాటి కొలమానం వేరుగా తయారు చేసివుంటే బావుండేది. ప్రతి సమాజం లాగానే, మనం వొక సహజమైన దారిలో ప్రకృతి ఆసరాగా జ్ఞానించుకుంటూ మనల్ని మనం నిర్మించుకున్నాం, దానికి దెబ్బ తగిలింది. అది దాడికి గురైంది. అదొక ప్రతిబింబాన్ని తయారు చేసింది. ప్రతిబింబ లక్షణాలు మారవు. ప్రతిబింబం యెప్పుడూ ప్రతిబింబమే, అది నాదే కానీ యేదో వెలితి. కానీ ఈ ప్రతిబింబాన్నుండి బయటపడటం కష్టం నేను మారితే తప్ప. అసలు మనమే ప్రతిబింబం. ఆ విషయం గ్రహించడమే జ్ఞానం. ప్రతిబింబానికి కనిపించే ప్రతిబింబం చాలా అకర్షనీయంగా, శిశ్న స్పృహలా సుఖంగా ఉంటుంది. కానీ సమాజపు నీతుల జాలంలో చిక్కి తృప్తిని పొందలేక యెర్ర దౌర్జన్య సిద్ధాంతాల్లో తల దాచుకునేలా చేస్తుంది. అక్కడ మనం నివశిస్తున్న సమాజ నీతుల పై వొక ప్రశ్న బయటపడి బుద్ధి కొలతతో వొ దృక్పథం యేర్పరచుకోడమో, యేర్పడ్డమో జరగచ్చు. దానికి

కొలమానినికలున్నాయి. Present people are a missing link between apes and humans అనే మోడిఫైడ్ డార్విన్ సిద్ధాంతం వుంది.

యెందుకో యేదో కవి చెప్పినట్టు ... కొందరి రచనల ప్రయత్నం ఏమైంది?

"హర్ కొషిష్ నాకామ్ " (ప్రయత్నాలన్నీ వ్యర్థం )

జీవన్ సిమట్ కర్ జామ్ హోగయి (జీవితం సంకోచించి యెక్కడో ఆగిపోయింది)

అంతో ఇంతో చైతన్యం చింతగా మిగిలింది. అందుకే ఈ అవలోకన!

పై భావజాల నేపథ్యంతో అవలోకింప బడిన రచయితలు, శీర్షికలూ:

విశ్వనాధ – మళ్ళిన దారి

గురజాడ – అంటించిన సెగ–పొగ

చలం – వదిలించిన శృంఖలత

గోపీచంద్ – ఎత్తుకున్న తాత్వికత

బుచ్చిబాబు – చెక్కిన శిల్పం దాని అందాలు

కారా – ఇచ్చిన బలి

రావిశాస్త్రి – న్యాయస్థానం

ఇంకా వున్నారు/వున్నాయి

COMMENTS